# అమ్మమ్మ

'పల్లెకు పోదాం ... పారును చూద్దాం... చలో... చలో... ఓహ్... తానేడ్పించే పారు ఊళ్లో ఎక్కడుంది...? ఈ పాటం బాగాలేదు. మరెవర్నేడిపించాలి...? అమ్మమ్మను... తానమ్మమ్మనేడ్పించగలడా? అమ్మమ్మ ఏడిస్తే తాను చూడలేడు. అయినా సరదా కేడ్పించాలి... అమ్మమ్మను తాను చూడక ఎన్నేళ్ళయింది...? ఆరేడేళ్లయింది. అమ్మమ్మను చూడాలి. ఇప్పుడెలా ఉందో అమ్మమ్మ...' సూట్ కేసూపుకుంటూ నడుస్తూ తనలో తాననుకుంటున్నాడు శంకరం.

అన్ని ఊళ్ళకూ బస్సుపడ్డా అమ్మమ్మ వాళ్ళూరికింకా బస్సుపడలేదు. అయినా ఎంత దూరంలే? రెండు కిలోమీటర్లుంటుందేమో? ఊరి వరకూ బస్సు ఉండుంటే తనకీ పచ్చని పంటచేల మధ్య చల్లని గాలి పీలుస్తూ నడిచే అవకాశముండేదా? ఆ ఊరికి బస్సు పడందే నయమైంది. తనకు నడవడమే ఇష్టం.

అమ్మమ్మను చూడబోతున్నానన్న ఆనందంతో కూనిరాగాలు తీస్తూ నడుస్తున్నాడు శంకరం.

పల్లెటూళ్ళంటే తనకెంతిష్టం...? ప్రాణం... ఆ ప్రేమలు, ఆ ఆప్యాయతలు... అవన్నీ పట్నంలో ఎక్కడ దొరుకుతాయి...? అమ్మమ్మకు వస్తానని చెప్పకుండా తానొస్తున్నాడు. అమ్మమ్మను సర్ ప్రైజ్ చేయాలి... ఆశ్చర్యంలో మునిగిపోయేట్టు చేయాలి...

అనుకుంటూనే ఊళ్లోకి చేరుకున్నాడు శంకరం. మధ్యాహ్నం సమయం వ్యవసాయ పను లెక్కువగా ఉన్న కాలమవటం వల్ల చాలమంది ఊళ్ళోలేరు. అమ్మమ్మ ఇల్లు చేరుతూనే గబగబా అరుగెక్కాడు. సూట్ కేసు కిందబెట్టి సుందరమ్మ పడుకున్న నులకమంచాన్ని సమీపించాడు. మంచం పట్టెపై కూర్చొని ఆమెపై చెయ్యేశాడు.

"అమ్మమ్మా... ఓ అమ్మమ్మా..." అని పిలిచాడు.

గాఢనిద్రలో ఉన్న సుందరమ్మ ఆ పిలుపు విని కళ్ళు తెరిచి చూసింది. చీపురు పుల్లల్లా ఉన్న చేతుల్తో కళ్ళు నులుముకుంటూ "ఎవరు బిడ్డా నువ్వూ...!" అంది.

ఆ మాటలతోనే శంకరం ముఖం చిన్నబోయింది.

"నేనమ్మమ్మా... శంకరాన్ని... నన్ను గుర్తుపట్టలేదా?" అన్నాడు.

మనువణ్ణి గుర్తుపట్టిన ఆ వృద్ధురాలి ముడుతలుపడ్డ ముఖంలో సంతోషాన్ని చూశాడు శంకరం.

"నువ్వాబిడ్డ... మంచి నిద్రలున్న... ఏర్పాటు చెయ్యలే..." అని లేచి కూర్చోబోయింది సుందరమ్మ. జోలెలా ఉన్న ఆ మంచంలోంచి లేవడమామెకు సాధ్యం కాలేదు.

శంకరం రెండు చేతులు పట్టి లేపి మంచంలో కూర్చోబెట్టాడు.

శంకరం శరీరాన్ని అప్యాయంగా తడుముతున్నాయామె చేతులు... అత్యంత ప్రియమైన వస్తువును తాకినట్టు తాకుతున్నాయి.

"ఎన్నేండ్లయింది బిడ్డ నిన్ను చూసి...! అమ్మ, బాపు అందరు మంచిగున్నారా? చెల్లె అత్తగారింటికాన్నే ఉంటుందా?" వయసు భారం వల్ల మాటలు తడబడుతుంటే మెల్లమెల్లగా అంది సుందరమ్మ.

"అందరం మంచిగానే ఉన్నమమ్మమ్మ... చెల్లె వారం రోజులకిందొచ్చి మొన్ననే అత్తగారింటికెల్లింది. నువ్వు మంచిగున్నవా అమ్మమ్మ మరి?" పైన చెయ్యేసి నిమురుతూ అన్నాడు శంకరం..

"ఎందుకు బిడ్డా, ఇంకా బతుకుడు...అందరికి బరువు... కాళ్లెయ్యాడంగ తొందరగ పోతనే మంచిది. అయితే మానాయెగని కాళ్లేతులు కడుక్కోనే లేదుగద నువ్వు... కడుక్కొచ్చుకో పో... నేను లేసి చెంబుల నీళ్ళు తెస్తుండు..." అని లేవబోయిన సుందరమ్మను లేవకుండా వారించాడు శంకరం.

"కాళ్ళు జేతుల దేముందమ్మమ్మా... బావిదగ్గరికెళ్ళి నేను కడుక్కుంటాను కాని, నువ్వు కూచో...ఇదిగో... నీకిష్టమని అమ్మ బొంది లడ్డు చేసి పంపింది... నేనేమో హోటల్ల కలకాందు కొనుక్కొచ్చిన" అని సూట్ కేస్ తెరిచి ఓ లడ్డు, ఓ కలకంద్ ముక్క తీసి చేతిలో పట్టుకొని తినిపించసాగాడు శంకరం.

ఈ మధ్యకాలంలో ఎవర్నుండీ ఇంత అప్యాయతను చవిచూడని సుందరమ్మ కళ్ళు చెమర్చాయి.

"మా తాసీల్దారుకు ఈ ముసలిదాని మీదున్న ప్రేమింక పోలేదు..." అని ప్రేమగా అతని ఒళ్లంతా నిమురుతోంది సుందరమ్మ.

"చిన్నప్పట్నుంచి నువ్వు నన్ను తాసీల్దారు కావాలనుకున్నవు. కాని నేను బేంకాఫీసర్నైన. సరెగని, అమ్మమ్మా... ఇంటినిండా మందుండెటోల్లు... ఇంట్లో సందడే కనపడుతలేదేంది?"

శంకరం మాటలకు సందరమ్మ ముఖం చిన్నబోయింది. కొద్ది క్షణాలాగి "ఎవ్వలుంటరు బిడ్డ ఇంట్ల... మీ ముగ్గురు మామలు ఇదువరకే ఏరువడ్డ సంగతి నీకెరికేనాయె... అయింతిద్దరు చిన్నమామలు గూడ ఏరువడ్డరు. ఎన్నేండ్లున్నా ఏరువడుడు తప్పది నిజమే కాని, ఏరువడ్డా ఒగల మంచొగలు కోరుకుంటుంటే మంచిగుండు... ఒకలంటొగలు కారాలు మిరియాలు నూరుకుంటుండ్రు... మీ నాయిన్న మీ మామలను పంచపాండవులోలె చూడాలనుకున్నడు కాని వీళ్లేమో కొట్లాడి సత్తండ్రు..."

"అందరెక్కడుంటండ్రు అమ్మమ్మా...?"

"ఈ ఇల్లు మీ చిన్నమామలిద్దరికచ్చింది... చెరిసగం ఉంటండ్రు. పక్కకున్నింట్ల మీ మూడోమామముంటండు... మీ పెద్ద మామలిద్దరు ఎడ్లకొట్టాన్ని మంచిగ చేసుకొనుంటండ్రు. బాగ పనులున్న యాల్లగదా కొడుక! అందరు పెరండ్లల్లకు, పొలాలకు పోయినట్టున్నరు. మీ మూడోమామ బిడ్డ అరుణ ఉరకత్తదిక్కడికి! కనపడుట లేదటుపాయె. నేను పిలుస్తుండు..." అని లేవబోయింది సుందరమ్మ.

"నీకెందుకమ్మమ్మా అరాటం! నువ్వు పిలుసుడేమద్దు. అదే వస్తది. నీకు పూర్తిగా చాతగాకుంటైనట్టుంది. సరెగని, మామలెప్పుడేరువడ్డ రమ్మమ్మా? అంటే, పూర్తిగా పంపకాలు చేసుకొని..."

"వానకాలమస్తే ఐదేండ్లకచ్చె. నువ్వీటురాక సానొద్దులైంది గదా బిడ్డ...!"

"నిజమేనే అమ్మమ్మ...! దూరాన చదువాయె. చదువయిపోయింతర్వాత నౌకరీ గురించి తిరుగుటానికే సరిపోయింది. రెన్నెల్లాయె విశాఖపట్నంల నౌకరి దొరికింది..."

ఇంతలో ఐదేళ్లపాపొచ్చి శంకరాన్ని కొత్తవాణ్ణి చూస్తున్నట్టుగా బెరుకుగా చూస్తూ దూరంగా నిల్చుంది.

"వచ్చినావె... ఎవ్వలనుకుంటున్నవే ఈ పిల్లగాన్ని...? నీకు బావైతడు. కొప్పెర్ల నీళ్ళు చేదు పో... కాళ్ళు చేతులు కడుక్కుటాడు బావ..." అంది సుందరమ్మ.

బావిదగ్గరికెళ్ళింది అరుణ.

"నేను మరిచిపోయిన, తాతేడమ్మమ్మ... కనబడుతలేడు. పంచాయితికి పోయిండా!"

ఆ మాటలు విన్న సుందరమ్మ ముఖం వివర్ణమైంది కడుపులోంచి తన్నుకొస్తున్న దుఃఖాన్నాపుకోడానికి ప్రయత్నిస్తోందామె. మనవడికేం జవాబు చెప్పాలో ఆమె కర్థం కావడంలేదు.

"మీ తాతకు తొంబయేండ్లకచ్చె. ఇంకా ఊళ్లు తిరుగుటానికి చాతనైంతందా? మీ తాత పెద్దమామింట్లుంటండు."

ఆ మాటలకు శంకరం నుదురు ప్రశ్నార్థకంగా ముడుతలు పడింది. "తాతక్కడ... నువ్విక్కడ, చెరో దగ్గరుండడమెందుకు?"

మనవడికి జవాబు చెప్పడానికి వృద్ధురాలికి మాటలు తడబడుతున్నాయి. కడుపులోంచి దుఃఖం పెల్లుబికి వస్తుంది.

"ఏం జెప్పాలె బిడ్డ? మీ మామలు భూములు పంచుకున్నరు. భూమితోని మమ్మలగూడ పంచుకున్నరు. నౌకరున్న ఇద్దరు మామలకు నౌకరిలేని మామలకందరికి మేం బరువే ఐతన్నం. మాకు చాతగాకుంటైంది గద."

ఆ మాటలు విన్న శంకరం హృదయం కలతచెందింది. అప్రియమైన విషయాన్ని విన్నట్టుగా విలవిలలాడింది.

టవల్ భుజమ్మీదేసుకొని, కట్ డ్రాయర్, బనియన్ తీసుకొని బావి దగ్గరికెళ్ళాడు శంకరం. మేనమామలంతా కలసి ఉమ్మడి కుటుంబంగా ఉన్నప్పుడు ఆ ఇంటికున్న దర్జా, అమ్మమ్మ స్థానం, ఆ ఇంట్లో తన చిన్నతనంలో గడిపిన రోజులు గుర్తొచ్చి

ఆలోచిస్తూ స్నానం చేయడం ముగించాడు. అమ్మమ్మ దగ్గరికొచ్చి ఆమె పక్కనే నేలపై కూర్చున్నాడు.

"అన్నముంటే పెట్టుపో బిడ్డ... బావెప్పుడు తిన్నడో?"

"నాకాకలిగా లేదు. కరీంనగర్లో ఈ ఊరిబసెక్కేముందే హోటల్లో భోంచేశాను. అన్నమద్దేమద్దు కాని చల్లటి మంచినీళ్ళుంటే తీసుకరా..." అన్నాడు శంకరం.

అరుణ కంచుచెంబులో నీళ్లు తెచ్చిచ్చింది. వాటిని తాగి చెంబు అరుణ చేతికిచ్చి "ఏయ్... నువ్వు పెరట్లోకెళ్లి పచ్చికంకులు తీసుకురా పో..."

"అమ్మమ్మ! నువ్వే కాల్చియ్యాలి కంకులు..." అన్నాడు శంకరం...

"బావచ్చిందడని ఓ పది కంకులు తే పో."

సుందరమ్మ మాట వింటూనే చెంబు కిందపెట్టి బయటకు పరుగెత్తింది అరుణ...

తన చిన్నతనంలో అమ్మమ్మింట్లో సాగించుకున్న విషయాలు గురించి చెబుతున్నాడు శంకరం... శంకరం చిలిపిపనుల గూర్చి సుందరమ్మ చెబుతోంది. వాళ్లలా మాట్లాడుకుంటుండగానే ఓ వృద్ధురాలు కట్టె భూమ్మీద ఆనిస్తూ ఒక్కొక్కడుగేస్తూ సుందరమ్మ దగ్గరి కొచ్చింది... ఆమె తల ముగ్గుబుట్టలా ఉంది...దేహమంతా ముడుతలుపడుంది. కళ్ళకు చేయడ్డం పెట్టుకొని శంకరం దిక్కు పరీక్షగా చూసిందామె. కొద్ది క్షణాలలాగే చూసి,

"ఈ పిలగాడెవలు సుందరమ్మా...!" అంది...

"నా మనువడు గాదె...? నా చిన్నబిడ్డ కొడుకు. నువ్వు మా చూసినవు. ఇప్పుడు కొయ్యోలె పెరిగిండు..."

"అయ్యో! వరవ్వ కొడుకా...! ఎప్పుడో చిన్నప్పుడు చూసిన..." అని–

"మంచిగున్నవా బిడ్డ...!" అంది శంకరం మీద చెయ్యేసి, ఆ వృద్ధురాలు.

"మంచిగనే ఉన్న..." అని "అమ్మమ్మా! ఈ ముసలమ్మెవరు...?" అన్నాడు శంకరం.

"కురుమ బాల్లింగం లేడా బిడ్డ...ఆయనె తల్లి... దీనికి ఐదుగురు కొడుకులు... ఐదుగురు బిడ్డలు... వాళ్లందరికి పిల్లలైండ్రు... వాళ్ల పిల్లలకు పిల్లలైండ్రు... ఇది మునిమనమలను, మనుమరాండ్రం జూసింది. వీళ్ల బలుగమంత కలుపుతె నూరు మంది దాటుతరు... మా దండి సంతీ ముసల్దాని."

"ముసలవ్వా! నీ మనుమలు, మనుమరాండ్రంత మంచిగ బతుకుతండ్రా...?"

"ఒగలకెదురు చూడకుంట మా బతుకుతండ్రు..."

"మరి నిన్ను మంచిగ చూసుకుంటున్నరా...?"

"ఏం మంచి బిడ్డా? మా చూసుకుంటండ్రు... మందలిచ్చెటట్టున్నదా...? ఏడ్సుకుంటెంత బువ్వ మా ఎత్తండ్రు."

"అవుబిడ్డ... ఆమన్నది నిజమే... ఇయ్యాల్లరేపు ఎవ్వలకెవ్వలు గాకుంటైతండ్రు – చాతగాకుంటైనంక చస్తేందన్నడు మీ సారు నౌకరి జేసేమామ – ఇంకోమామేమొ

మమ్ముకలం జంపుతవు గని నువ్వెందుకు సత్తవే అన్నడు..." అంది సుందరమ్మ మనుమన్ని దగ్గరకు తీసుకుంటూ...

వాళ్ళ మాటల గూర్చే ఆలోచిస్తున్న శంకరం ఏం మాట్లాడలేదు. "మీ అమ్మమ్మ చూడు... బహుగ బతికింది... కడుపునిండ కన్నది. ఇయ్యాల్ల మాకు కాల్లుజేతు లాడకుంటాయెవరకు వాళ్ళకు బరువై పోతున్నం. మీ మేనమామలు ముసలోల్లను పంచుకున్రని... ముసలితనంల ఒక్కకాడుంటె ఒకరికొకరు తోడున్నట్టుండె... గా మాట నా అసొంటోల్లంటె ఎక్కడుంటోందని గద్దరిచ్చిరి... పెద్దమనుషులే గిట్ల పంచాయతుల్జేసిరి...."

"బెల్లమున్నకాడ, ఈగలు ముసురుత యంటరు చూసినవా...? గట్టుంది లోకం...! చేతుల కొన్ని పైసలు పట్టుకొనుంటె ఆ పైసల కోసమన్న చుట్టుముసిరెటోల్లు... గాండ్లరాజయ్య ముప్పైవేలు దగ్గరుంచుకొని వడ్డీలకు తింపుకుంటండు... తననెవ్వలు మంచిగ చూసుకుంటే అళ్ళకే పైసలన్నాడు... వాటాశకు ఇద్దరు కొడుకులు. కోడండ్లు బంగారమోలె చూసుకుంటండ్రయినెను... అంత పైసతోనే భాగోతం... పైస చేతులుంటేనే అవ్వయిన, అయ్యయిన..."

ఆ వృద్ధురాలి పరిశీలనాశక్తికి ఆశ్చర్యపోయాడు శంకరం. ఆమె మాటల్లో కఠోర వాస్తవాలున్నా – అవే పూర్తి కారణాలు మాత్రం కావనుకున్నాడు...

"అమ్మమ్మా! మరి నువ్వేం దగ్గరుంచుకోలేదా డబ్బు...?"

"గా గుంటసిక్కులన్ని నాకేడ తెలుత్తయి బిడ్డ...? నా చేతిల పైసలేడున్నయి...? నాది పెత్తనమున్నన్ని రోజులు ఇంటికోసమే అన్నిజేత్తి... అందరు నావోల్లే అనుకుంటి... మెడలకు నల్లపూసలు గుండ్లు గూడ చేయించుకోపోతి...! ఎవ్వల మీద పైసలు దాసుకోవన్నో చెప్పబిడ్డ...! నా కొడుకుల మీదనేనా...? అవ్వి లేకుంటేంబాయె... కూడువెడితె తినేది... లేకుంటే కూడుగ్గవట్టి సచ్చేదేంది...?" అంది సుందరమ్మ.

"మన కాలపోల్లకు గవ్వన్ని తెలువయి... ఎంతైన మనదెడ్డికాలమే... ఇప్పటి పోరగాండ్లెంతుషారున్నరో చెప్పలేం... పెండ్లాం పక్కలకు రాంగానే ఏరువడితెనె మేలని దూరముంటండ్రు... అవ్వయ్యలను దూరం గొడుతండ్రు. పైస, పైసని పైస సంపాదనకే సూత్తండ్రు..."

ఆ మాటలు విని శంకరం, సుందరమ్మ నవ్వారు...

ఇంతలో అరుణ పరిగెత్తుకుంటూ వచ్చి వాకిట్లో నిల్చుంది... వట్టిచేతుల్తో వచ్చిన మనుమరాల్ని చూసి

"బావకు కంకులు తేలేదానె..." అంది సుందరమ్మ.

"బాపే వచ్చేటప్పుడు తెస్తనన్నడు..."

"బావచ్చిండని చెప్పలేదా నువ్వు...?"

"మా చెప్పిన్నే నానమ్మ... నేను మాతెస్తపో అని గద్దరిచ్చిండ్రు..."

"పచ్చికంకులు కూడ అమ్ముకుంటానికి మరిగిండ్రు బిడ్డ. ఇయ్యాల రేపే మన్న

చెప్పవచ్చేటట్లున్నదా...? చుట్టమంటలేరు... పక్కమంటలేరు..." అంది నిష్ఠురంగా సుందరమ్మ...

శంకరమేం మాట్లాడకుండా మౌనంగా తలూపాడు...

"గీ మక్కకంకులేం మాసరే... నీ కొడుకే వచ్చేటప్పుడు తెస్తడు... వచ్చే యాళ్లయితుంది గదా...!" అంది వృద్ధురాలు...

"బావకింత చాయన్న చేసిపొయ్యి..."

"నాకు చాయద్దేమద్దు... పెరుగుంటె అందులో కొన్ని నీళ్ళుపోసి ఉప్పకలిపి తీసుకురా... చల్లగుంటుంది తాగడానికి..."

శంకరం అరుణతో అనగానే ఆమె సాయమాన్లో (వంటింట్లో) కెళ్ళి చూసివచ్చింది...

"పెరుగు లేదేం లేదే నానమ్మ..." అని, "మా ఇంట్ల నుంచి తెస్తుండు." అని పరుగెత్తింది అరుణ...

"గీ పల్లెటూళ్లల్ల పెరుగేడుంటది...? లేనోల్లకు లేకనేపాయె... పాడున్నోల్లు మునుపు ఇంత తవుడు పెడితేనో, వర్తిగనో లేనోల్లకు చల్ల, పెరుగు పోసెటోల్లు... ఇపుడు పట్నాలల్ల అమ్ముకుంటుంద్రు... ఓ మోటర్లచ్చి కొనుక్క పోతరు... అంత అడివికచ్చింది..." అందా వృద్ధురాలు... లేచి నిల్చుంది...

"నేం బోతనవ్వ..." అని కట్టె చేతితో పట్టుకొని వంగుతూ నడవసాగింది.

అరుణ పొడవు గ్లాసులో తెచ్చిచ్చిన మజ్జిగను తాగి లేచి నిల్తున్నాడు శంకరం... పాంటు, షర్టు తొడుక్కున్నాడు...

"అమ్మమ్మా...!" నేను తాతను చూసొస్తా... అని పెదమామ ఇంటిదిక్కు నడిచాడు.

అమ్మమ్మలాగే తాత కూడా నులక మంచంలో బిక్కుబిక్కుమంటూ ఒంటరిగా ఉండటం చూశాడు... ఇద్దరి పరిస్థితికీ పెద్దగా తేడా లేనట్టు గమనించాడు...చాలా సేపు తాతతో మాట్లాడాడు...

అమ్మమ్మ దగ్గరికి తిరిగొచ్చాడు... మామ తెచ్చిచ్చిన మక్కకంకులు కాల్చిస్తే తిన్నాడు...

సాయంత్రమయ్యేసరికందరూ ఇండ్లకు చేరుకున్నారు... అత్తామామలు, బావమరుదులు, మరదళ్ళందరితో మాట్లాడాడు...

కొన్ని గంటల్లోనే ఎన్నో విషయాలను తెలుసుకున్న శంకరానికి అదోలా ఉంది... ఆ ఊరికి వచ్చేటప్పుడున్న ఉత్సాహమిప్పుడు లేదు...

ఐదుగురు మేనమామలిండ్లలో ఐదు రోజులున్నాడు... ఎక్కువగా పెదవులపై మాటలనే చూశాడు...

"మా పిల్లలంజేసుకుంటావా...? అయినా నువ్వెందుకు జేసుకుంటవు...? పట్నంలో నౌకరిజెయ్యవడ్తివి... మీ కండ్లకు మేమానుతమా...?" అంటూ నిష్ఠురాలాడిన అత్తల, మేనమామల మాటలు శంకరానికి బాధను కల్గించాయి...

ఈ ఐదురోజుల్లో పాతస్నేహితులెందర్నో కలుసుకున్నాడు... ఊరంతా తిరిగి చూశాడు... చెరువుగట్టుకు వెళ్ళి కూర్చున్నాడు... చేండ్లు, పొలాలదిక్కూ స్నేహితుల్తో వెళ్ళాడు...

ఇంకెన్నో విషయాలను గమనించాడు శంకరం... అమ్మమ్మతరం, ఆ తర్వాతి తరం, ఆ తర్వాతి తరం వాళ్ళలో విలువల్లో గల అంతరాలను గమనించాడు... మారుతున్న సంబంధాలను గ్రహించాడు... గ్రామాల్లోకి రూపాయిలాంటిది ప్రవేశించి సంబంధాలను వ్యాపారమయం చేస్తున్నట్టు గమనించిన శంకరంకు బాధ కల్గింది.

'అమ్మమ్మలాంటి వాళ్ళు నిర్లక్ష్యానికి గురవుతున్నారా...?' ప్రశ్నించుకున్నాడు. అతనికవుననే సమాధానం వచ్చింది... కాని అమ్మమ్మకా ఆలోచనే ఉన్నట్టు కనబడలేదతనికి... అయినా ఆమెలో ఏదో తెలియని వెలితిని గమనించాడతను.

తెల్లవారితే ఊరెళ్ళుతాననగా మధ్యాహ్నం అమ్మమ్మ దగ్గర కూర్చున్నాడు..." అమ్మమ్మా... నువ్విలా ఉండడం నీకు బాధగా లేదా...?" అన్నాడు శంకరం.

ఆ మాటలకు సందరమ్మేం మాట్లాడకుండా నవ్వి ఊర్కుంది...

మళ్ళీ అదే ప్రశ్నడిగాడు శంకరం...

"పరిస్థితులే అట్లుంటె ఎవర్ని తప్పు పట్టాలి...?" అంది సుందరమ్మ...

ఆమె మాటల్లోని లోతులనర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు శంకరం... తననెంతో ప్రాణంగా చూసుకున్న అమ్మమ్మను, తనకెంతో ప్రియమైన అమ్మమ్మను తనతో తీసుకెళితే...? అదే మాట ఆమెతో అన్నాడు...

"అమ్మమ్మా! నువ్వు నాతో వస్తావా...?"

కొంచెంసేపేం మాట్లాడలేదు సుందరమ్మ...

"వచ్చి నేనెన్ని రోజులుండాలక్కడ...? అయినా, మీ అమ్మ మాత్రం నన్నెందుకింతకంటె బాగా చూసుకుంటుంది...? దానికి నేనేమిచ్చిన్నని...? తన కేమివ్వలేదని, నాకు కొడుకుల మీదనే ప్రేమని మీ అమ్మ నన్ను దెప్పుతూనే ఉంటుంది... అదన్నదాంట్లో తప్పేంలేదు...కొద్ది రోజులుంచుకున్నాక ఆస్తేమొ కొడుకుల కిచ్చినవు... నన్నేమొ సాదుమంటువా అనదా...? అట్ల ఎవ్వలైనా అంటరు... కష్టమో, సుఖమో నేనిక్కన్నే ఉంటాను...లోకరీతికి వ్యతిరేకంగుండుడు నా కిష్టం లేదు..." అంది ఏ దాపరికమూ లేకుండా సుందరమ్మ...

అమ్మమ్మా! నువ్విలా మాట్లాడటం నాకు బాగనిపించడం లేదు... ఆస్తులిస్తేనే తల్లిదండ్రులను పోషించాలా...? మరి ఆస్తులు లేనివాళ్ళ సంగతేంటి...?" నిష్టురంగా అన్నాడు శంకరం...

"నేనంటే నీకు బాగిష్టం కాబట్టి నా కోసం నువ్వు బాధపడ్తున్నవు నిజమే...కాని, ఒక్కసారి మీ నాయనమ్మ సంగతాలోచించు... ఒక్క మీ నాయనమ్మ సంగతేం కాదు... దాదాపందరు నాయనమ్మల సంగతి... మీ నాయనమ్మ పరిస్థితి నా కంటే గొప్పగుంటె అప్పుడు నేను నీతో వస్త..."

ఆ మాటలు సూటిగా తగిలాయి శంకరానికి... నాయనమ్మ పరిస్థితిని మననం చేసుకున్నాడు శంకరం. .. ఆమె పల్లెటూళ్ళో అమ్మమ్మ కంటే అధ్వాన్నమైన పరిస్థితుల్లో ఉండటం గుర్తుకొచ్చి చలించిపోయాడు శంకరం...

'అమ్మమ్మ గూర్చి ఇంతాలోచిస్తున్న తాను నానమ్మ గురించెందు కాలోచించలేదు...?' తనను తానే ప్రశ్నించుకున్నాడు...

అమ్మమ్మతో మాట్లాడటానికింకేం లేదనిపించిందతనికి...

'అమ్మమ్మ వయసుతోనే కాదు జీవితానుభవాలతోనూ పండింది...'

తనలో తాననుకున్నాడు...

తెల్లవారి అందరికీ వీడ్కోలు చెప్పి, పక్కూరువరకు ఎడ్లబండ్లో పోయి బస్సెక్కాడు శంకరం...

బస్సులో కూర్చున్న శంకరానికి అమ్మమ్మ, తాత, నానమ్మల పరిస్థితులే కళ్ళముందు కదులుతున్నాయి... వృద్ధతరంవాళ్ళ సమస్యలెన్నో మనోనేత్రం ముందు కదలాడుతున్నాయి... 'రేపు తన తల్లితండ్రులు... ఆ తర్వాత తాను...' ఇక ఆలోచించలేకపోయాడు శంకరం...

ఇలాంటి పరిస్థితులకు మారిన పరిస్థితులే కారణమని సరిపెట్టుకోవడాని కాతని మనసంగీకరించడం లేదు... కారణా లార్థికపరమైనవి మాత్రమే నని అనుకోవడానికి అతని మనసొప్పుకోవడం లేదు...

'ఎక్కడో లోపముంది... ఎక్కడో లోపముంది... వీటి వెనుకేవో శక్తులున్నాయి...' రకరకాలుగా ఆలోచిస్తూనే ఉన్నాడు శంకరం...

బస్సు గమ్యస్థానం దిక్కు పరుగెత్తుతూనే ఉంది...

● *'ఈనాడు' ఆదివారం, 5-5-96* ●

★ ★ ★